క్లుప్తంగా

బస్ షెల్టర్ ప్రారంభం



బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం : మండలంలోని ఆళ్లమడుగు గ్రామంలో మండల అధ్యక్షుడు కామసాని పద్మనాభరెడ్డి, భారతి కుమారుడు దినేష్‌రెడ్డి జ్ఞాపకార్థం నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్‌ను డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అధ్యక్షుడు కామసాని పద్మనాభరెడ్డి తన కుమారుడి జ్ఞాపకార్థం ప్రజల కోసం తన సొంత నిధులతో బస్ షెల్టర్ నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం మహిళలకు చీరలను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, నాయకులు హేమసుందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, సర్పంచ్‌లు గోవిందయ్య, శ్రీనాథరెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బహుజన చైతన్యయాత్రను జయప్రదం చేయండి

శ్రీరంగరాజపురం : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు వెనుకబడిన తరగతుల వారు ఏకతాటిపై నడిచి, అభివృద్ధికి కృషి చేసే పార్టీని ఆదరించాలని వెనుకబడిన కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సరేష్ అన్నారు. గురువారం మండలంలోని పుల్లూరు, మిట్టకండ్రిగ, యు.యం.పురం గ్రామాల్లో బహుజన చైతన్య యాత్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. మండల అధ్యక్షుడు రామరాజు, మహేష్, కళావతమ్మ, మురారి, అజయ్, గిరి, హేమంత్, తరుణ్ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యార్థులకు నోటుపుస్తకాలు అందిస్తున్న దాత భాస్కర్‌రాజు

విజయపురం (నగరి) : మండలంలోని మహావీరపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాత భాస్కర్ రాజు విద్యాసామగ్రి అందించారు. గురువారం విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రయ్య చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. గత 10 ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాత భాస్కర్‌రాజు విద్యాసామగ్రి అందించడం చాలా సంతోషకరమని ఉపాధ్యాయులు అన్నారు.

రోడ్డు సమస్య పరిష్కారం



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

నగరి : మున్సిపల్ పరిధిలోని పద్మావతినగర్‌లో రోడ్డు సమస్య పరిష్కారమైంది. మంత్రి ఆర్కేరోజా ఈ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో స్థానికులు రోడ్డు, కల్వర్టు సమస్యను ఆమె దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆమె రోడ్డు, కల్వర్టుల నిర్మాణాన్ని చేపట్టాలంటూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గురువారం ఈ పనులను మున్సిపల్ చైర్మన్ పీజీనీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి పరిశీలించారు. మంత్రి ఆదేశాలతో విడుదలైన గడపగడపకు నిధులు రూ.7.45 లక్షల వ్యయంతో రోడ్డు, కల్వర్టు నిర్మిస్తున్నామని వారు తెలిపారు. త్వరలో రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. కౌన్సిలర్ ఇంద్రయ్య, డీఈ నరేష్ పాల్గొన్నారు.

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ సిబ్బందికి శిక్షణ



శిక్షణ అందిస్తున్న మల్లికార్జునయ్య

నగరి : విత్తనాలు, ఎరువుల నాణ్యత, మట్టి పరీక్షపై నగరి అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో పలమనేరు ల్యాబ్ సిబ్బందికి డీడీఏ ఆర్‌సీసీ మల్లికార్జునయ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఎరువులు, విత్తనాలు పరీక్షల గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ప్రారంభమైన ఈ శిక్షణ ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మొదటి రెండు రోజులు విత్తన నాణ్యత పరీక్షలు, మూడు రోజుల పాటు ఎరువులు నాణ్యత పరీక్షలు, చివరగా మట్టి పరీక్ష పద్ధతుల గూర్చి శిక్షణ ఇస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలోని రైతులంతా విత్తనాలు, ఎరువులను ఉచితంగా పరీక్షించుకుని వాడుకోవచ్చని తెలియజేశారు. రైతు భరోసా కేంద్రానికి వచ్చే ఎరువులు, విత్తనాలను ల్యాబ్‌లో పరీక్షించిన తర్వాతే రైతులకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సౌభాగ్య లక్ష్మి, ఏఓ రిసోర్స్ పర్సన్ చెంచురెడ్డి, ఏఓ యామిని, ఏఈఓ తులసి జలంధర్, సెందామరం, పలమనేరులో కొత్తగా ఏర్పాటు చేసిన ల్యాబ్ సిబ్బంది ఏఓ సంధ్య, ఏఈఓ శివశంకర్ పాల్గొన్నారు.

విద్యకు మించిన సంపద లేదు



అధికారులతో చర్చిస్తున్న సీనియర్ సివిల్‌జడ్జి కరుణకుమార్

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి కరుణకుమార్

పుత్తూరు రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి ఐ.కరుణకుమార్ స్పష్టం చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యకు మించిన సంపద మరొకటి లేదన్నారు. విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని అధిరోహించాలని సూచించారు. చదువు మీదే దృష్టి సారించాలని ఈ క్రమంలో ఎలాంటి వ్యామోహాలకు లోనుకాకూడదని తెలిపారు. 18 ఏళ్లు నిండే వరకు వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్యవివాహాల వల్ల పలు అనారోగ్య సమస్యలు కలుగుతాయన్నారు. అవసరమైనప్పుడు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఏ.రఘుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

పుత్తూరు రూరల్: పుత్తూరు సబ్‌కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి ఐ.కరుణకుమార్ పిలుపునిచ్చారు. గురువారం కోర్టు ఆవరణలో వివిధ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ ప్రధానంగా చెక్కు, ప్రామిసరీ నోటు బాండు బౌన్స్ కేసులు రాజీ చేయాలని సూచించారు. పెండింగ్‌లోని సివిల్, రాజీకి లోపబడిన క్రిమినల్ కేసులు, మనోవర్తి, ప్రీలిటిగేషన్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు చేపట్టాలని ఎంవీఐ అధికారులను జడ్జి ఆదేశించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే వారిని ఉపేక్షించరాదని సూచించారు. కార్యక్రమంలో పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి జానకి, పోలీసు, న్యాయ, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఎక్సైజ్, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్



సదస్సుకు హాజరైన విద్యార్థినులు

నగరి : విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల గురించి విద్యార్థి దశలోనే తెలుసుకోవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి డాక్టర్ ఐ.కరుణకుమార్ తెలిపారు. బుధవారం సూర్య జూనియర్ కళాశాలలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలు ఎలా సహకరిస్తాయి ? ఎలా సంప్రదించాలన్న అంశాలపై విశదీకరించారు. అందరూ బాగా చదువుకుని ఉన్నతస్థాయికి వెళ్లాలని సూచించారు. అనంతరం కోర్టు ఆవరణలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం డీఎస్పీ, ఆర్డీఓ, నగరి, నిండ్ర విజయపురం మండలాలకు చెందిన సీఐలు, ఎస్‌ఐలు, మండల, మున్సిపల్ అధికారులు, బార్ అసోసియేషన్ సభ్యులతో లోక్ అదాలత్‌పై చర్చించారు. పెండింగ్ కేసులను పరిష్కరించుకునేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం కోర్టు సిబ్బందితో సమావేశమై ఈ ఏడాది నిర్వహించాల్సిన షెడ్యూల్ విషయమై చర్చించారు. కార్యక్రమాల్లో జూనియర్ సివిల్ జడ్జి ఎ.గోపాలకృష్ణ, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏపీపీ రామ్ శాంతి పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి

- ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నాం
- ప్రతి గడపలో అపూర్వ స్వాగతం పలుకుతున్నారు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని రామకృష్ణాపురం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, తమ కుమార్తె మహిళా నాయకురాలు కృపాలక్ష్మితో కలసి మండల కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే సమస్యలను వింటూ అప్పటికప్పుడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న నాయకత్వమంటే అది పూర్తిగా జననాయకత్వమేనని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజాప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల ముందు ప్రజలకు భరోసా కల్పించామని, ఇప్పటికే 99 శాతం హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చడం జరిగిందన్నారు.

ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం..

గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని పథకాలను గత నాలుగున్నరేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసి ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని తెలిపారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీ సభ్యులు ప్రభుత్వ పథకాలను అర్హులకు ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం గ్రామాల్లోనే సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడమే కాకుండా వలంటీర్ల వ్యవస్థతో సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్ల ముంగిటకే చేరుస్తున్నారని అన్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కుమార్తె కృపాలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక వారికి అనుకూల ఎల్లో మీడియాలతో కలసి రాష్ట్ర ప్రభుత్వంపై విష ప్రచారం మొదలు పెట్టారన్నారు. అయితే జగనన్న అందిస్తున్న సంక్షేమాలు అందుకుంటున్న లబ్ధిదారులు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి బ్రహ్మరథం పట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం రాజాఇండ్లు గ్రామస్తుల వినతి మేరకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామాల్లో సీసీ రోడ్లు, మరుగు నీటి కాలువలు లేవని మంత్రి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన మంత్రి వెంటనే గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, నాయకులు దూదిమోహన్, కృష్ణారెడ్డి, యతీశ్వర్ నాయుడు, నవీన్‌కుమార్‌రెడ్డి, దాము, మధుసూదన్ రెడ్డి, మునేంద్ర, మురళిమోహన్‌శెట్టి అధికారులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకానికి డీఆర్‌డీఏ కృషి



పెరటి కోళ్లను అందిస్తున్న మండల కన్వీనర్ మణి

శ్రీరంగరాజపురం : డ్వాక్రా సంఘ సభ్యుల అదనపు ఆదాయం కోసం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పెరటి కోళ్ల పెంపకానికి కృషి చేస్తోందని ఏపీఎం రోజా అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని డ్వాక్రా సంఘాల సభ్యులకు అదనపు ఆదాయం కోసం రూ.3000 యూనిట్ విలువతో 11 పెరటి కోళ్లను అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఇవే కాక ఆసక్తి గల సంఘ సభ్యులు తయారు చేసే వస్తువులను కూడా డీఆర్‌డీఏ సంస్థ మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేసి, సంఘాలకు నాణ్యమైన వస్తువులను తక్కువ ధరకు అందిస్తామన్నారు. అనంతరం అర్హులైన సభ్యులకు పెరటి కోళ్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, మండల కన్వీనర్ మణి, నాయకులు పాల్గొన్నారు.

సమరయోధుల సేవలు చిరస్మరణీయం



రిటైర్డ్ ఆర్మీ జవాన్‌ను సత్కరిస్తున్న సురేష్‌రాజు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ మోహన్‌మురళి

పుత్తూరు రూరల్: స్వాతంత్ర్య సమరయోధులు, దేశ సైనికుల సేవలు చిరస్మరణీయమని వడమాలపేట జెడ్పీటీసీ మాజీ సభ్యులు సురేష్‌రాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని నారాయణపురం పంచాయతీలో నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సోల్జర్ ఎం.వెంకటకృష్ణయ్యను సత్కరించి ఆయన చేతుల మీదుగా జాతీయ జెండాను ఎగురవేశారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయాలని కోరారు. అంతకుముందు గ్రామంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ శిలాఫలకాన్ని ప్రారంభించారు. గ్రామ ప్రజలచే పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేయించారు.

కార్వేటనగరంలో..

కార్వేటినగరం: స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాన్ని ప్రతి ఒక్కరూ చాటి చెప్పాలని సర్పంచ్ ఆకుల మంగమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని సీడీ కండ్రిగ గ్రామంలో నాదేశం–నా భూమి నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ప్రాణప్రతిజ్ఞ చేయించారు.

నింద్రలో..

నింద్ర: నాదేశం– నా మట్టి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంత చేయాలని ఎంపీపీ దీప అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నా మట్టి – నా దేశం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ అనిత అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీడీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో నాదేశం–నాభూమి నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలో విద్యార్థులు జాతీయ పతాకాలను చేతపట్టి మానవ హారాన్ని ఏర్పాటు చేశారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా పాలసముద్రంలో పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ సర్పంచ్ అయ్యప్ప, సింహరాజుపురం సర్పంచ్ భాస్కర్‌రెడ్డి సమక్షంలో నా భూమి–నా దేశం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు అమరవీరులను స్మరించుకున్నారు. కార్యక్రమానికి శిలాఫలకాన్ని ప్రారంభించారు. అధికారులు, నాయకులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శంకరంబాడి జయంతి



శంకరంబాడికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు రూరల్: ''మాతెలుగు తల్లికి మల్లెపూదండ'' గీతాన్ని రచించిన శంకరంబాడి సుందరాచార్యులు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం శంకరంబాడి జయంతి కార్యక్రమాన్ని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకరంబాడి తెలుగులో గేయకవిత్వం, బుర్రకథలు, నాటకాలు, ఖండకావ్యాలు, కథలను రచించారని కొనియాడారు. అంతకుముందు శంకరంబాడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు ఎం.నరసింహులు ఎం.ధర్మారావు పాల్గొన్నారు.


పురవీధుల్లో సుబ్రమణ్యస్వామి చిద్విలాసం



పురవీధుల్లో దర్శనమిస్తున్న వళ్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి

కార్వేటినగరం: ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రెండవ రోజు స్కంధపుష్కరిణి సమీపంలోని కుమారగిరిపై వెలసిన వళ్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారిని గురువారం పురవీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం వళ్లీదేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

వేడుకగా సారె సమర్పణ..



సారె తీసుకొస్తున్న చాకలివానిగుంట ఎస్టీ కాలనీ వాసులు

ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం చాకలివాని గుంట ఎస్టీకాలనీకి చెందిన వారు వళ్లీదేవసేనసమేత శ్రీసుబ్రమణ్యస్వామివారికి ఆనవాయితీ ప్రకారం పట్టువస్త్రాలు, పరిమళ భరిత పుష్పమాలికలను ప్రత్యేక వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. స్థానిక సర్పంచ్ స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కే.కేశవరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

12న శుద్ధ తిరుమల - సుందర తిరుమల

తిరుపతి సిటీ: తిరుమల, తిరుపతి రెండు ఘాట్ రోడ్లు, నడకదారుల్లో శనివారం శుద్ధ తిరుమల – సుందర తిరుమల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీటీడీ జేఈవో సదా భార్గవి ఆదేశించారు. ఆమె గురువారం తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి గృహంలో అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో టీటీడీ విద్యాసంస్థల నుంచి 750 మంది విద్యార్థులు పాల్గొంటారని, ఒక్కో సెక్టార్లో 30 మంది చొప్పున 25 సెక్టార్లుగా విభజించామని చెప్పారు. రవాణా, శానిటరీ మెటీరియల్, క్యాటరింగ్, ప్రథమ చికిత్స కిట్లు, చెత్త సేకరణ, రోప్‌లు, వైర్ లెస్ సెట్లు తదితర అంశాలపై ఆమె ఆరా తీశారు.

ఆల్బెండజోల్‌తో రక్తహీనతకు చెక్



విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న జార్జ్, డాక్టర్ మోహన్‌కృష్ణ

- విద్యార్థుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఉచితంగా మాత్రలను పంపిణీ చేస్తోంది
- జిల్లా గణాంక అధికారి జార్జ్

పాలసముద్రం : రక్తహీనత నివారణకు విద్యార్థులు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని జిల్లా గణాంక అధికారి జార్జ్ తెలిపారు. గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పాలసముద్రం ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి మోహన్‌కృష్ణ సమక్షంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా గణాంక అధికారి జార్జ్ మాట్లాడుతూ భోజనం చేయడానికి ముందు విద్యార్థులు తమ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పుత్తూరులో..



పుత్తూరులో పిల్లలకు మాత్రలు వేస్తున్న సిబ్బంది

పుత్తూరు రూరల్: పిల్లల్లో రక్తహీనత నివారణకే ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ కేఆర్ రమేష్ తెలిపారు. గురువారం జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక కామరాజ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు పంపిణీ చేయడం జరిగింది. 3 నుంచి 6 ఏళ్ల పిల్లలకు భోజనం తర్వాత మాత్రలను ఇచ్చి నీటిని తాగించారు.

శ్రీరంగరాజపురంలో..



శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె చిన్నతయ్యూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..



కార్వేటినగరంలో..

కార్వేటినగరం: విద్యార్థుల్లో రక్తహీనతను నివారించడానికి ఆల్బెండజోల్ గుళికలను వేయాలని ఎంపీడీఓ మురళీమోహన్ అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు గుళికలను అందించారు. పీహెచ్‌సీ డాక్టర్ గోపీనాథ్, ఎంఎల్‌హెచ్‌పీ కవిత సిబ్బంది పాల్గొన్నారు.

నింద్రలో..



నింద్రలో..

నింద్ర: మండలవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు వైద్యాధికారి కల్యాణి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 1–19 సంవత్సరాలు వయసు కలిగిన మొత్తం 2,990 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నగరిలో..

నగరి : మండలంలోని బుగ్గఅగ్రహారం పాఠశాలలోని విద్యార్థులకు వైద్యసిబ్బంది నులిపురుగుల మందులను పంపిణీ చేశారు. గురువారం పాఠశాలకు వెళ్లిన ఎంపీహెచ్‌ఈఓ ఏఎస్ సాగర్ ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. సమావేశంలో ఆల్బెండజోల్ (నులి పురుగుల మందు) వేయడం వల్ల రక్తహీనతకు దారి తీసే పురుగులను నశింపజేయవచ్చన్నారు. నడుపునొప్పి, మంట, నీరసం, వాంతులు, అతిసారం లాంటి వాటికి నులిపురుగులే కారణమన్నారు.

షాదీ మహల్ పనుల పరిశీలన



షాదీమహల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: పట్టణంలో తుది మెరుగులు దిద్దుకుంటున్న షాదీమహల్ నిర్మాణ పనులను గురువారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ రూ.1.85 కోట్లతో అందంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. షాదీమహల్ నిర్మాణంతో నగరి నియోజకవర్గ పరిసర ప్రాంతాల మైనారిటీల చిరకాల స్వప్నం నెరవేరుతోందని అన్నారు. తుదిదశ పనులపై పంచాయతీరాజ్ అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ ఎంకే చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ సత్యనారాయణరెడ్డి, డీఈఈ వినోద్‌కుమార్‌రెడ్డి, ఏఈఈ జె.వీరయ్య, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ వీఎం మాహీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలీప్ మొదలి తదితరులు పాల్గొన్నారు.

అధర్మంపై గెలుపే మహాభారతం





హరికథా గానం చేస్తున్న భాగవతారిణి సుమతి, హరికథా గానం వీక్షిస్తున్న జనం

పుత్తూరు రూరల్: అధర్మంపై ధర్మం గెలుపే మహాభారత సారాంశం అని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి అన్నారు. గురువారం శ్రీద్రౌపదీ సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాభారత హరికథ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భాగవతారిణి ఎస్.సుమతిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 రోజులపాటు జరగనున్న మహాభారత హరికథను ప్రతిఒక్కరూ ఆస్వాదించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బీఎస్‌మోహన్ పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

కార్వేటినగరం: స్థానిక సంస్థల ఉప ఎన్నికలకు సంబంధించి గురువారం నామినేషన్ల పర్వం ముగిసింది. కత్తెరపల్లి గ్రామసర్పంచ్ స్థానానికి ఐదుగురు నామినేషన్లు వేయగా, వార్డు మెంబరు స్థానాలకు రెండు నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారి గిరీష్‌కుమార్ తెలిపారు.

గంగాధరనెల్లూరులో..



ఏకగ్రీవమైన గంగయ్య

గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని నెల్లేపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి గురువారం ఒకే నామినేషన్ రావడంతో గంగయ్యను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎన్నికల అధికారి శరవణరెడ్డి తెలిపారు. అలాగే కొండేపల్లి వార్డుకు ఒకే వ్యక్తి శేఖర్ నామినేషన్ దాఖలు చేశారు. వరత్తూరు వార్డుకు టీ.నాగరాజు, టీ.కార్తీక్, టీ.ముద్దుకృష్ణయ్య, శ్యాంప్రసాద్ నలుగురు నామినేషన్ దాఖలు చేశారు. అలాగే జీడీ నెల్లూరులో ఒక వార్డుకు విజయ, మునెమ్మ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.



సర్పంచ్ అభ్యర్థి తరపున నామినేషన్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పూర్తయిన నామినేషన్ల ప్రక్రియ

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని వేపగుంట పంచాయతీ 3వ వార్డు, పరమేశ్వరమంగళం 4వ వార్డు ఉప ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. చివరి రోజున పరమేశ్వరమంగళంలో ఎం.రమాదేవి, ఎస్.లత, ఎం.జె.సుజాత నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎలక్షన్ ఆఫీసర్ ఎం.మలర్‌విలి తెలిపారు. అలాగే వేపగుంటలో ఏ.భారతి, ఏ.మునెమ్మ నామినేషన్లు దాఖలు చేశారన్నారు. దీంతో పరమేశ్వరమంగళంలో మొత్తం 3, వేపగుంటలో 3 నామినేషన్లు వచ్చినట్లు స్పష్టం చేశారు.